: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 28 | 8-04-2024 | పుటలు : 4


## మంచిమాట

కేవలం పుస్తకాలు చదివి వదిలేస్తే
ప్రయోజనం ఏముంది?
చెదపురుగులు కూడా
పుస్తకాలను నమిలేస్తాయి
అంతమాత్రాన జ్ఞానం వచ్చేసినట్లా
- డా.బీఆర్.అంబేద్కర్



## జేఎన్టీయూకే ఇన్నోవేషన్ ఫెయిర్ లో నన్నయ వీసీ



జేఎన్టీయూకే లో రెండు రోజుల పాటు డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేషన్ ఫెయిర్ కు నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె పద్మరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు మాట్లాడుతూ ఇటువంటి సదస్సులో పాల్గొనడం ద్వారా విద్యార్థులు తమ ఆలోచనలను పంచుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. పరిశోధన, కొత్త ఆవిష్కరణలకు వేదికగా జేఎన్టీయూ డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ నిలిచిందన్నారు. గిరిజనులకు బైక్ అంబులెన్స్, తేమ నుంచి నీటి ఉత్పత్తి వంటి పలు ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను జేఎన్ టీయూకే డైరెక్టర్ గోపాలకృష్ణ రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసలు పొందారన్నారు. అనంతరం డైరెక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వీసీలు ప్రసాదరాజు, పద్మరాజులను సత్కరించారు. కార్యక్రమంలో ఓఎస్ కోటేశ్వరరావు, రిజిస్ట్రార్ సుమలత, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.







షడ్రుచుల సమ్మేళనం జీవితం!
అదే ఉగాది ఇచ్చే సందేశం!!

క్రోధి నామ సంవత్సర
ఉగాది శుభాకాంక్షలు!!

- నన్నయవాణి

## నన్నయలో పర్యటించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి










సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూములను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పరిశీలించారు. ఈ ప్రాంగణంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ పూర్తయిన వెంటనే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఈవీఎంలను, ఇతర అనుబంధ యూనిట్లను ఇక్కడకు తీసుకుని వచ్చి, నియోజకవర్గాల వారీగా కేటాయించిన స్ట్రాంగ్ రూములలో భద్రపరుస్తామని కలెక్టర్ మాధవీలత ఆయనకు వివరించారు. ఈ విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ కూడా అమలు చేస్తున్నామని చెప్పారు. దీనికోసం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలు, రూట్ మ్యాప్లను వివరించారు. ఇక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ జగదీష్ వివరించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం, రూరల్, కొవ్వూరు, రాజానగరం, గోపాలపురం, నిడదవోలు, అనపర్తి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎన్. తేజభరత్, అశుతోష్ శ్రీవాత్సవ్, ఎ.చైత్ర వర్షిణి, కేఎల్ శివజ్యోతి, ఆర్.వీ. రమణా నాయక్, ఎం. మాధురి, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు.

## ఫెన్సింగ్ విద్యలో నైపుణ్యం సాధించాలి

**- వీసీ ఆచార్య కె పద్మరాజు**



ఫెన్సింగ్ (ఖడ్గ యుద్ధ క్రీడ)లో ఏషియన్ ఛాంపియన్షిప్, కామన్ వెల్త్ స్థాయిలో భారత దేశానికే వన్నె తెచ్చిన ఫెన్సింగ్ క్రీడాకారిణి భవానీ దేవిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, తద్వారా ఫెన్సింగ్ విద్యలో మరింత పట్టు, నైపుణ్యం సాధించాలనీ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాల ఇండోర్ క్రీడా మైదానంలో రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ యువజన, సాంస్కృతిక శాఖ(ఎఫ్ఎపీ) ఆధ్వర్యంలో 25వ జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ (ఖడ్గ యుద్ధ క్రీడ) చాంపియన్ షిప్ పోటీలను సోమవారం సాయింత్రం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన నన్నయ వర్సిటీ వీసీ పద్మరాజు, విశిష్ట అతిథిగా విచ్చేసిన జీఎస్ఎల్ విద్యాసంస్థలు చైర్మన్. ప్రముఖ వైద్యులు డాక్టర్ గన్ని భాస్కరరావులు తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కత్తి చేతబట్టి ఖడ్గాని తిప్పుతూ క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సొంత ఆభరణాలను తాకట్టు పెట్టే స్థాయి నుండి భారత దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయి కి చేరుకున్న ఫెన్సింగ్ క్రీడాకారిణి భవానీ దేవి కష్టాన్ని ప్రతిఒక్కరు గుర్తించాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథిగా హాజరైన జీఎస్ఎల్ ర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ ఖడ్గ యుద్ధ క్రీడలతో ఆత్మస్థైర్యం కలుగుతుందన్నారు. ఎదుటి వ్యక్తి కదిలికలను గ్రహించడం, ఆటపై ఏకాగ్రత సాధించడం వంటి ప్రత్యేక క్షణాలు పై పట్టు సాధించేందుకు ఫెన్సింగ్ దోహద పడుతుందన్నారు. ఆఫ్ఎఎపి రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.వి కృష్ణ మోహన్ మాట్లాడుతూ పోటీలకు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 10-14 ఏళ్ల మధ్య వయ సున్న క్రీడాకారులు బాలికలు విభాగం లో 250 మంది, బాలుర విభా గంలో 271మంది,160 మంది కోచ్ లు, మేనేజర్లు, టెక్నీషియన్లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పోటీలకు తరలివచ్చారన్నారు. మార్చి 25 నుంచి 28వరకూ 4 రోజులపాటు పోటీలు క్రీడా పోటీలు జరుగుతా యని తెలిపారు.



**క్రీడా పోటీలు విధివిధానాలు ఇవే -**

కత్తి పట్టడం, కత్తి తిప్పడం, కత్తి యుద్ధాలు అనగానే టక్కుమని గుర్తొచ్చే దృశ్యాలు అక్కినేని నాగేశ్వరరావు, కాంతారావు, రామారావు నటించిన సాంఘిక, పౌరాణిక చిత్రాలు అప్పట్లో అందర్నీ ఆకట్టుకునేవి. సినిమాలో మాత్రమే చూసే ఈ ఖడ్గ యుద్ధ క్రీడలు ప్రత్యక్షంగా పోటీలను జివిఎల్ లో నిర్వహించడంతో వాటిని తిలకించేందుకు విద్యార్థులు, అధ్యాపకులు పలువురు ఆసక్తి కనబరిచారు. జివిఎల్ ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు జరిగే ఖడ్గ విద్య పోటీలలో నువ్వానేనా అన్న రీతిలో క్రీడాకారులు తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా ఎఫ్ఎపీ రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.వి కృష్ణ మోహన్ మాట్లాడుతూ ప్రతి ఇద్దరి క్రీడాకారులు మధ్య మూడు నిమిషాల చొప్పున నిమిషం వ్యవధితో వెంట వెంటనే మూడుసార్లు పోటీ ఉంటుంద న్నారు. 15 పాయింట్లు సాధించిన వారిని విజేతలగా నిర్ణయిస్తార న్నారు. పోటీలో నైపుణ్యాలను ఖచ్చితంగా గుర్తించడానికి ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగిస్తున్నట్లు మాజీ సెక్రెటరీ, అసోసియేషన్ మెంటార్ ఎన్ సురేష్ బాబు చెప్పారు. విజేతలకు బంగారు, వెండి, పతకాలు, రెండు కాంస్య పతకాలు బహుమతులుగా అందిస్తారని తెలిపారు.



# సంపాదకీయం



## ఎప్పటికప్పుడే కొత్త!

ప్రపంచమనే పుస్తకంలో ఎప్పటికప్పుడు ప్రతీది కొత్త పేజీ. అది ఒక కొత్త జీవితానికి శ్రీకారం చుడుతూ ఉంటుంది. *Every thing is Flux* అని ఇంగ్లీషులో ఒక మాట ఉంది. ప్రతి అంశం ప్రవాహశీలమైందని అర్థం. నిన్నటిలా ఇవాళ ఉండదు. ఇవాల్టిలా రేపు ఉండదు. నేను ఈ నదిలో ఈ నీటిలోనే స్నానం చేస్తుంటాను.. అంటాడు. అది అబద్ధం.నిన్నటి నీరు వేరు. ఇవాల్టి నీరు వేరు. అంతెందుకు మునిగి లేచిన ప్రతిసారి కొత్త నీటిలో స్నానం చేస్తుంటాం. ఇదే "ఎప్పటికప్పడే కొత్త "అంటే!ఈ శీర్షికతో పద్మశ్రీ బోయి భీమన్నగారు ఒక పద్య ఖండికను రాశారు కూడా.

కాలచక్రం తిరిగిపోతూ ఉంటుంది.పైని ఆకులు క్రిందికి, పైకి క్రింది ఆకులు తిరుగుతూ ఉంటాయన్నారు విశ్వనాథ సత్యనారాయణ గారు. కాలమమూల్యంబు కదలు కుమార! అనంతకాల శికతముల యందు నీ కాలి ముద్రలు ముద్రించి పొమ్ము అంటారు మాతృదర్శనంలో దువ్వూరి రామిరెడ్డి గారు. కాలానికి ఒక రూపం లేదు, దానికి పాపం లేదు, కాలం అద్దం లాంటిది, అంధయుగమైనా స్వర్ణ యుగమైనా అది మన ప్రతిబింబం. కాలం వలయం లాంటిది. దానికి కేంద్రం లేదు. ఎవడికి వాడే ఇచ్చా ప్రయత్న బలంతో వర్ణోజ్వల వలయాలను సృష్టించగలుగుతాడు అంటారు తిలక్. కాలం గురించి ఆధునిక కవులు ఒక్కొక్కరు ఒక్కొక్క బాణీలో తమదైన శైలిలో కవితా ప్రక్రియలో విశ్లేషించారు.

ఉగాదికి వసంతం,కోకిల రాగం,వేపపూత,మామిడి... ఇవన్నీ క్రొత్తవే. ప్రతి క్షణం క్రొత్తగా మనకోసం వస్తూ ఉంటుంది. తనకు లభించిన క్షణాన్ని ఒడిసి పట్టుకొని సద్వినియోగం చేసుకున్న వాడి జీవితం వసంతమవుతుంది. జీవనవసంతంలోని మాధుర్యాన్ని హృదయం నిండా నింపుకోవటం మన చేతుల్లో ఉంది.కాలం నిత్యసంతోషి, నిరంతర పురోగామి. దానికి అన్ని ఋతువులు సమానమే. దానికి ఏ అవస్థ లేదు. మన అవస్థలను దానికి ఆపాదిస్తాం. ఎండ, వాన, శీతకాలాలను మన యవ్వన, ప్రౌఢ, వృద్ధాప్య అవస్థలతో పోల్చుకుంటాం. మన సుఖదుఃఖాలనే ప్రకృతిలో ప్రతిబింబాలుగా దర్శించుకుంటాం. అంతే!

ఇంగ్లీషు సాహిత్యంలో జే.ఎస్. మిల్ పండితుని మాట.. *Eternal Vigilance is the prince of Liberty* స్వేచ్ఛ యొక్క ఖరీదు నిత్యము జాగరూకతతో ఉండటమే.కాలం మారుతూ ఉంటుంది. కొత్త ఆలోచనలు, కొత్త ఉద్యమాలు వస్తూ పోతూ ఉంటాయి. అవి రోజు వచ్చి పోయే ప్రభాత సాయం సంధ్య లాంటివి. ఆ రెండిటి నడిమి కాలంలో ఎవరైతే మేల్కొని ఉంటారో దానిని సద్వినియోగం చేసుకుంటారు. వారే దానికి అధిపతి అవుతారు. వారిదే పై చేయి అవుతుంది. బద్ధకస్తుడికి ఉషస్సు తెలియదు. ఖాళీగా ఉన్న మనిషి మెదడు దెయ్యాల ఖార్ఖానా అని ఒక మాట ఉంది. (Devils Workshop). సోమరి చేయగలిగిందేముంది. సమాజం ముందు దోసిలొగ్గుతాడు.

కాబట్టి కాలం మారుతుంది,ఉగాది ప్రకృతిలోని మార్పుకి చిహ్నం.ఆ మార్పు మనిషి అభివృద్ధికి తీర్పు కావాలి. హృదయం నిండా కొత్త జీవనమనే అమృతాన్ని నింపుకొని నిత్యం జ్ఞానంతో బ్రతక నేర్చిన తెలివితేటలతో ఉండటమే మన ముందున్న కర్తవ్యం.అదే నిజమైన యుగాది!విజయోస్తు!!ం

## ట్రైనింగ్ ప్రోగ్రామ్ హాజరైన ఆక్వా కల్చర్ విద్యార్థులు



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆక్వాకల్చర్ డిపార్ట్మెంట్ విద్యార్థులు, కృషి విజ్ఞాన కేంద్రం పందిరి మామిడి, డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం మరియు జాతీయ మత్స్య అభివృద్ధి మండలి (ఎన్ ఎఫ్ డి బి )హైదరాబాద్ వారు అలంకరణ చేపల ఉత్పత్తిలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులపై ఐదు రోజులు పాటు (29-02-2024 నుండి 4-03-2024) కృషి విజ్ఞాన కేంద్రం పందిరిమామిడి రంపచోడవరం అల్లూరి సీతారామరాజు జిల్లాలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆక్వా కల్చర్ విద్యార్థులు హాజరయ్యారు.అలంకరణ చేపల ఉత్పత్తిలో చేపల ఉత్పత్తి విధానం , గుర్తించే పద్ధతులు గుర్తించే పద్ధతులు ,అలంకరణ చేపల తొట్టెల నిర్మాణం మరియు నిర్వహణ గురించి అలాగే మేత యాజమాన్య పద్ధతుల గురించి విస్తృత అవగాహన కల్పించారని విద్యార్థులు పేర్కొన్నారు . దీనికోసం విస్తృత అనుభవం ఉన్న శాస్త్రవేత్తలు మరియు నిపుణులు బోధనతో పాటు ప్రాక్టికల్స్ కూడా చేసి చూపించారు. ఈ శిక్షణ పై చదువులకే కాక స్వతహాగా ఉపాధి అవకాశాలు సృష్టించుకోవడానికి ఉపయోగపడుతుందని విద్యార్థులు తెలియజేశారు. విభాగాధిపతి ప్రొఫెసర్ .కె.రమనేశ్వరి మాట్లాడుతూ పరిశోధనకు మరియు ఉపాధికి ఆక్వా కల్చర్ కోర్సులో మంచి అవకాశాలు ఉన్నాయని ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు వలన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని తెలియజేశారు. విభాగ అభివృద్ధి కోసం అలాగే విద్యార్థులకు ప్రోత్సాహం అందించడంలో ఉపకులపతి ఆచార్య. కె .పద్మరాజు యొక్క సహకారాన్ని కొనియాడారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి. విజయనిర్మల మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో ఉపయోగపడతాయని తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులకు సబ్జెక్టు పై మక్కువ పెరుగుతుందని విభాగ అధ్యాపకులు డా.డి.శ్రీధర్ తెలియజేశారు



## గ్రంథకర్త డాక్టర్ సుబ్బారావును అభినందించిన వీసీ



'ది ఫిలాసఫీ ఆఫ్ అడ్జస్ట్మెంట్, యాంగ్జయిటీ అండ్ అకడమిక్ అచీవ్మెంట్' పుస్తకాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆవిష్కరించి, గ్రంధకర్త డా.కొండ్రు సుబ్బారావును అభినందించారు. గురువారం యూనివర్సిటీలో పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ వివరాలను తెలియజేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డా. కె. సుబ్బారావు మరియు డా.కొయ్యలమూడి రాధ 'ది ఫిలాసఫీ ఆఫ్ అడ్జస్ట్మెంట్, యాంగ్జయిటీ అండ్ అకడమిక్ అచీవ్మెంట్' పుస్తకాన్ని రచించారని తెలిపారు. ఐ ఎస్ బి ఎన్ నెంబర్ తో బుక్ రివర్స్ న్యూఢిల్లీ వారిచే ఈ పుస్తకం ప్రచురించడం జరిగిందన్నారు. పుస్తక రచయితలను వీసీ అభినందించారు. రచయిత డా. సుబ్బారావు మాట్లాడుతూ మాధ్యమిక పాఠశాలల్లో గల విద్యార్థులు సర్దుబాటు వ్యాకులత మరియు వార్షిక ప్రగతి ఏ విధంగా ఉంటుందో అనేక ఉదాహరణలతో వివరించామన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పుస్తకాన్ని ఫ్లిప్కార్ట్, గూగుల్ పే ద్వారా కొనుగోలు చేయవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, అకాడమిక్ డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా రోప్ స్లిపింగ్‌లో న్యూరోసీ రజత ప్రతిభ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ఫార్మసీ విభాగానికి చెందిన వి. న్యూ రోజీ, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్షిప్లో రజత పతకాన్ని సాధించింది. భోపాల్లోని ఎల్.ఎన్.సి.టి విశ్వవిద్యాలయం నిర్వహించిన పోటీల్లో రోజీ ఈ పతకాన్ని సాధించింది.

వి న్యూరోసీ పోటీ అంతటా అసాధారణమైన నైపుణ్యం మరియు దృఢనిశ్చయాన్ని ప్రదర్శించింది. ఆమె అత్యుత్తమ విజయాన్ని క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి అశోక్ అభినందనలు తెలిపారు. బోధనా సిబ్బంది లిఖిత, డా. హీరా, డా. సురేంద్ర, నిత్యానంద్ మరియు అరుణ అలానే బోధనేతర సిబ్బంది మరియు ఫార్మసీ విద్యార్థులు వి న్యూరోసీ ని అభినందించారు.




## టిసిఎస్ ఉద్యోగానికి ప్రవేశ పరీక్ష



టి.సి.ఎస్ లో ఉద్యోగానికి సంబంధించిన ప్రవేశ పరీక్షను శనివారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్లేస్మెంట్ సెల్ మరియు వికాస సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రెండు వందల మంది విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలల విద్యార్థులు హాజరై పరీక్ష వ్రాసారు. దీనిలో ప్రతిభకనపరచిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని సంస్థ ప్రతినిధులు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా.బి.జగన్మోహనరెడ్డి, వికాస సంస్థ మేనేజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్‌ను
# ఆదర్శంగా తీసుకోవాలి



విద్యతోనే ఏ సమస్యనైనా అధిగమించగలమని దృఢ సంకల్పంతో భారతదేశ చరిత్రలో తనదైన ముద్ర వేసుకున్న మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అందరూ ఆదర్శంగా తీసుకోవాలని వీసీ ఆచార్య కె. పద్మరాజు తెలిపారు. శుక్రవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాలులో బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విసి పద్మరాజు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించిన జగ్జీవన్ రామ్ భారతీయ స్వాతంత్ర్య కార్యకర్తగా, స్వాతంత్ర అనంతరం సుదీర్ఘకాలం కేంద్ర మంత్రిగా పనిచేశారన్నారు. విద్యతోనే ఆయన ఉన్నత పదవులను అధిరోహించి వాటికి వన్నె తీసుకువచ్చారని తెలిపారు. 30 సంవత్సరాలు వివిధ రంగాలలో మంత్రిగా కొనసాగిన ఆయన కాలంలో ఆధునిక దేవాలయాలుగా పిలవబడే నాగార్జునసాగర్ వంటి డ్యామ్ నిర్మాణాలు జరిగాయని గుర్తు చేశారు. బాబూజీగా ప్రసిద్ధి కెక్కిన బాబు జగజ్జీవన్ రామ్ ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఉన్నత విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. తల్లిదండ్రులు మరియు అధ్యాపకులు మహనీయుల జీవిత చరిత్రలను విద్యార్థులకు బోధిస్తుండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్ వర్మ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎం.గోపాలకృష్ణ విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నన్నయలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై అవగాహన



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో క్వాంటమ్ కంప్యూటింగ్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిసోర్స్ పర్సన్ గా సిగ్నియోన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీరామ్ జయసింహ, విశ్వవిద్యాలయ అధికారులు మరియు ఫిజిక్స్ విభాగ అధ్యాపకులు విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భవిష్యత్ లో క్వాంటమ్ కంప్యూటింగ్ కు ఎక్కువ ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ పై ఫిజిక్స్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పట్టు సాధించాలని తెలియజేసారు. ఫిజిక్స్ కోర్సుతో పాటు క్వాంటమ్ కంప్యూటింగ్ ను బోధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రిసోర్స్ పర్సన్ శ్రీరామ్ జయసింహ మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్ ఫిజిక్స్ అప్లికేషన్స్ కు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని ఫిజిక్స్ నేపథ్యం కలిగిన ప్రతీ ఒక్కరూ దీనిపై పూర్తి అవగాహన పెంచుకుంటే చక్కని అవకాశాలు లభిస్తాయన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ వేగంగా ఫలితాలు లభిస్తాయన్నారు. ప్రస్తుతం ఉపయోగించే గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జి.పి.ఎస్) బదులుగా క్వాంటమ్ పొజిషనింగ్ సిస్టమ్(క్యూ.పి.ఎస్) అందుబాటులోనికి వచ్చే అవకాశాలు ఉన్నాయని, క్యూ.పి.ఎస్. ఆవిష్కరణలో ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ గా వ్యవహరిస్తున్నారని ప్రశంసించారు. తరువాత విద్యార్థులు, అధ్యాపకులు క్వాంటమ్ కంప్యూటింగ్ పై అడిగిన సందేహాలను నివృత్తి చేసారు. తరువాత రిసోర్స్ పర్సన్ శ్రీరామ్ జయసింహ ను సన్మానించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఎన్.పి.ఎల్ న్యూఢిల్లీ రిటైర్డ్ సైంటిస్ట్ భగవాన్ నారాయణ, ప్రిన్సిపాల్స్ డా.పి.విజయనిర్మల, డా.పి.వెంకటేశ్వరరావు, డీన్స్ ఆచార్య వై.శ్రీనివాసరావు, డా. కె. రమణేశ్వరి, డా.కె.వి.స్వామి, డా.డి.కళ్యాణి, డా.కె.నూకరత్నం, డా.డి.లత, డా.కె.దీప్తి, డా.టి.హైమావతి, డా.పి.ఉమామహేశ్వరి, డా.ఎస్.రాజ్యలక్ష్మి, డా.వై.సుష్మ ప్రియ, వి.రాజశేఖర్, బి.వి.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి






విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, మానసిక, శారీరక దృఢత్వానికి సామాజిక సేవా కార్యక్రమాలు దోహదపడతాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె. పద్మరాజు అన్నారు. శుక్రవారం జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ వై. డి.రామారావు ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆదిత్య జిల్లా డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ వింగ్ వాలంటీర్లను వీసీ అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, బిఆర్పీఎస్ కార్యదర్శి శివకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దివాకరరావు, రెడ్ క్రాస్ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఎలక్ట్రీషన్ రమేష్ గృహప్రవేశానికి హాజరైన వీసీ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎలక్ట్రీషియన్ గన్నవరపు రమేష్ గృహప్రవేశానికి విసి ఆచార్య కె. పద్మరాజు హాజరయ్యారు. శుక్రవారం రమేష్ గృహప్రవేశానికి హాజరైన వీసీ నూతన గృహాన్ని చూసి సంతోషాన్ని వ్యక్తంచేశారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు.

# కాకినాడలో జగ్జీవన్ రామ్ జయంతి



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాకినాడ క్యాంపస్ లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆచార్య ప్రశాంతి శ్రీ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను ప్రస్తావిస్తూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నన్నయలో ఏఐ ఫర్ సోసైటి ప్రోగ్రామ్



ఆదికవి నన్నయ యూనివర్సిటీ సెమినార్ హాల్ లో ఏఐ ఫర్ సోసైటి ప్రోగ్రామ్ ను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అధ్యక్షత వహించగా వీసీ ఆచార్య కె.పద్మరాజు ముఖ్యఅతిథిగా హాజరై ఉపన్యసించారు. వీసీ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మెషిన్ లెర్నింగ్‌పై భారతదేశపు అతిపెద్ద కాన్ఫరెన్స్, %ూ×% డేస్ 2024, మార్చి 30 మరియు 31 తేదీల్లో జే.ఎన్.టీ.యూ హైదరాబాద్‌లో జరిగిందన్నారు. ఏఐ డేస్ 2024 సదస్సులో 2,000 మందికి పైగా ఐటి నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్‌లు మరియు విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈ క్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి, దానిపై పూర్తి అవగాహనను పెంపొందించుకోవడానికి సదస్సులో పాల్గొన్నామని చెప్పారు. కంప్యూటర్లు క్రొత్తగా అందుబాటులోనికి వచ్చిన కాలంలో ఉద్యోగులంతా భయాందోళనకు గురైన తరువాత కాలంలో అన్ని కార్యాలయాల్లో కంప్యూటర్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. నేడు కంప్యూటర్లు లేని కార్యాలయాలను ఊహించలేమన్నారు. అలాగే సాంకేతిక పరిజ్ఞానం నిరంతరం మారుతూ వస్తుందని దానికి తగినట్టు మనమంతా అప్ డేట్ కావాలన్నారు. నేటి ఆధునిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ క్రీయశీలకమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఏఐ పై పట్టు సాధించిన వారికి ప్రపంచ దేశాలలో మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలియజేసారు. డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ మాట్లాడుతూ డేటా డిజిటల్ ఫార్మట్ లోకి అందుబాటులోనికి వచ్చిన తరువాత ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నామన్నారు. ఏఐ ఎడ్యుకేషన్ కు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. వ్యక్తిగతీకరించిన అభ్యాసం, ఇంటెలిజెంట్ ట్యూటోరింగ్ సిస్టమ్స్ మరియు ఎడ్యుకేషనల్ అనలిటిక్స్ ద్వారా ఏఐ విద్యను విప్లవాత్మకంగా మార్చగలదన్నారు. ఏఐ మెరుగైన అసెస్‌మెంట్, వర్చువల్ తరగతి గదులు, కరికులం డిజైన్ మరియు డెవలప్‌మెంట్‌లో ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏఐ విద్యలో పరిశోధన మరియు ఆవిష్కరణలకు అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. డీన్ ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంకేతిక పరిజానం పెంపొందించుకొనని వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ముప్పు వాటిల్లుతుందన్నారు. వ్యవసాయం, వైద్యం, రవాణా వంటి అన్ని రంగాల్లో ఏ.ఐ. తనదైన శైలిలో నూతన ఆవిష్కరణలు తీసుకురాబోతుందన్నారు. ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల ఏఐ ఇన్ హెల్త్ కేర్ కు సంబంధించిన అంశాలను వివరించారు. ప్రాంప్ట్‌లకు ప్రతిస్పందనగా ఉత్పాదక నమూనాలను ఉపయోగించి టెక్ట్స్, చిత్రాలు, వీడియోలు లేదా ఇతర డేటాను రూపొందించగలదన్నారు. జనరేటివ్ ఏ.ఐ. తో ఆరోగ్య సంరక్షణ అవసరాలకు అవకాశం ఉందన్నారు. ఉత్పాదక ఏఐ అప్లికేషన్లు – ప్రారంభ క్యాన్సర్లు మరియు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడానికి పరికర రూపకల్పనకు ఉపయోగపడుతుందన్నారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ డా.బి.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఏఐ యొక్క బలం తర్కం మరియు జ్ఞాపకశక్తిలో ఉందన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఈ ప్రయోజనం మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. స్పీచ్ రికగ్నిషన్ ద్వారా పొలానికి నీరు పెట్టే కొడుకులా ఏఐ అభివృద్ధి చెందిన వైనాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. డీన్స్ డా.ఎ.మట్టారెడ్డి, డా.ఎన్.ఉదయ్ భాస్కర్ ఆయా విభాగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర ఏ విధంగా ఉంటుందనే విషయాలను తెలియజేసారు. షేర్ ట్రెండ్ మరియు ధరను అంచనా వేయడం, కస్టమర్ సేవ మరియు చాట్ బాట్‌లు, ప్రమాద నిర్వహణ, క్రెడిట్ రేటింగ్ (%జ×దీ×ూ%) మరియు రుణ నిర్ణయాలు, కాలానుగుణ నవీకరణలు మరియు హెచ్చరికలకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందుబాటులోనికి తీసుకువచ్చేందుకు వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ ప్రయత్నాలు సఫలీకృతం అయ్యే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14)



సుదీర్ఘమైన మనదేశ చరిత్రలో ఎందరో మహానుభావులు ఉద్భవించారు. వారి వారి కాలాల్లో తమ కర్తవ్యాలను నిర్వహించారు. సమాజ జీవనంలో అవసరమైన మలుపు తీసుకుని రావటానికి తమకుగల శక్తియుక్తులన్నింటిని దారపోసి ప్రయత్నించారు. సత్వర ప్రయత్నాలను పొందిన, కాలాంతరంలో ఫలితాలు సమకూర్చిన, సమాజ శ్రేయస్సుకు సామరస్యానికి భంగం కలగని రీతిలో నడుపుకుంటూ వచ్చిన వారు ధన్యులు.

భారతదేశపు పునరుజ్జీవనానికి రూపురేఖలు దిద్దిన వారిలో అడుగులు వేసిన మహనీయులు డా.బి.ఆర్.అంబేద్కర్.జీవితాన్ని నిరంతర పోరాటంగా స్వీకరించి తన ప్రజలకోసం, తన సమాజం కోసం, తన దేశంకోసం నిరంతరం తపించిన వ్యక్తి డా.అంబేద్కర్. ఎవరికి ఇవ్వవలసిన మర్యాదను, గౌరవాన్ని వారికి ఇస్తూనే తనకు సంతృప్తికరమైన సమాధానం వచ్చే వరకు రాజీపడని యోధుడాయన.

సునిశిత మేధాశక్తితో సమస్యల్ని అన్ని కోణాలనుంచి అధ్యయనం చేసి సమాజానికి దీర్ఘకాలిక ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని పరిష్కారాన్ని ప్రతిపాదించిన ద్రష్ట అంబేద్కర్.ఆయన జీవితమంతా ఒక అద్భుత చిత్రం. ఒక యజ్ఞం. సమాజానికి సమర్పణం.

అంబేద్కర్ అందరికీ తెలుసు.కానీ ఆయన గురించి తెలిసింది చాలా తక్కువ. ఆయన జీవితాన్ని అధ్యయనం చేసిన వాళ్ళు తక్కువ. కానీ మామూలుగా చదివిన వారు కూడా తక్కువే. కొందరి దృష్టిలో ఆయన విద్యావంతుడు.అయితే ఆ విద్యను,జ్ఞానాన్ని ఎంత కష్టపడి సంపాదించారనేది చాలామందికి తెలియదు. కొందరి దృష్టిలో ఆయన దళిత జన విముక్తి దాత. అయితే అదే సమయంలో తన యావత్తు సమాజంలోని దుర్లక్షణాల గురించి వారి హృదయం ఎంత దుఃఖానికి గురయ్యిందో, యావత్తు సమాజ సంరక్షణకు ఎంతగా తాపత్రయపడ్డారో తెలియదు. కొందరి దృష్టిలో ఆయన రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప విజ్ఞాన వేత్త. అయితే ఆయన జీవితంలో ఎటువంటి అవమానాలకు, ఈసడింపులకు గురయ్యారో తెలియదు.

ఉన్నతమైన పదవులు అధిష్టించిన కాలంలో కూడా ఆయనను కొందరు ఎలా చిన్నబుచ్చి చూశారో చాలామందికి తెలియదు. ఆయన స్వతంత్ర భారతదేశపు మొదటి మంత్రివర్గంలో సభ్యునిగా తెలుసు. అయితే దేశ విభజన జరిగినప్పుడు మన దేశాన్ని ఎలా రూపొందింప చేయాలని ఆయన ఘోషించారో తెలియదు.

రాజ్యాంగాన్ని రూపొందించే సంరచనా సమితిలో ఏడుగురు సభ్యులు ఉన్నప్పటికీ కొందరికి అనారోగ్యం కారణంగానూ, కొందరికి ఇతర వ్యాపకాలు బాధ్యతలు ఉన్న కారణంగానూ బాధ్యత ప్రధానంగా బాబాసాహెబ్ భుజస్కంధాల మీద పడింది. వివిధ దేశాల రాజ్యాంగాలు అధ్యయనం చేసిన అనుభవంతో రాజ్యాంగ నిర్ణయ సభలో జరిగిన చర్చల్లో దాదాపుగా ప్రతి విషయం మీద ఆయనే సమాధానాలు ఇచ్చారు.

గతంలో పీడితులుగాను, వంచితులుగానూ ఉన్న వర్గాలకు ప్రత్యేక రాయితీలు ఇస్తూ భారతదేశంలో అనుసరిస్తున్న పద్ధతి, దాని వ్యాప్తి, విస్తృతి సమాజంలో వాడుకలో ఉండిన వ్యత్యాసాలను అంతరాలను సూక్ష్మంగా పరిశీలించి భారతదేశ సమానతను మౌలిక ప్రాతిపదికగా అంగీకరించి సమాజంలోని విభిన్న వర్గాల్లో పేరుకుపోయిన హెచ్చుతగ్గు, పేదభావాలను పూర్తిగా తొలగించడానికి భారత రాజ్యాంగంలో నియమాల్ని రూపొందించారు.

పర్యవసానంగా పూర్వపు నష్టాలను తొలగించేవి, గాయాలను మాన్పేదయిన అనేక యోజనలను రాజ్యాంగంలో రూపొందించారు అంబేద్కర్.

ఒంటరైపోయిన సమయంలో కూడా తన ప్రతిభతో అందరినుండి గౌరవాన్ని పొందటమేకాక, తన తోటి ప్రజానీక మంతటికి గౌరవాన్ని సంపాదించి పెట్టే పనిలో అంబేద్కర్ దృఢదీక్షతో విజయం సాధించారు.

మనిషికి, జంతువుకీ మధ్య తేడా ఉంది. జంతువుకి బ్రతకడానికే ఆహారం అవసరం. కానీ మనిషికి శరీరంతో పాటు చైతన్యవంతమైన మనసు ఉంది.ఈ రెండిటినీ అతడు పోషించాలి. ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాల్సిందేమంటే రోగాలు రాకుండా మనకు ఆరోగ్యవంతమైన శరీరం ఎలా ఉండాలో అలాగే శరీరం ఆరోగ్యంగా ఉండటం కోసం జాగృతి గల మనసుని అభివృద్ధి చేసుకోవాలనీ, మనిషికి సంపూర్ణ వికాసం కావాలనీ అంటారు డాక్టర్ అంబేద్కర్.

అంబేద్కర్ ఒక ప్రవక్త కాదు.ఒద్దికగా తలవంచుకుని కూర్చుని మీరు ఏమి చెప్పినా శిరసా వహిస్తానని భావించే శ్రోతలకు కాదు ఆయన తన ఉపన్యాసాలు వినిపించింది. తాను నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు తన ప్రజల ప్రయోజనాలను సాధించటానికి ఖండన,మండనలు, ప్రశ్నలు,ఎదురు ప్రశ్నలతో కూడిన వాదాలు ఆయన వినిపించవలసి వచ్చింది.తనను సమర్థించే వాడొక్కడు కూడా లేని సభలో ఆయన ప్రసంగించవలసి వచ్చింది. శూన్యం నుండి తన సృజన శక్తిని ప్రదర్శించవలసి వచ్చింది. కాబట్టి ఆయా సందర్భాలకు అవసరమైన పద్ధతిలో తన వాక్చాతుర్యాన్ని వినియోగించి అవతలి వ్యక్తులను తన దారిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేశారు.

భారతీయులు కొన్ని వేల సంవత్సరాలుగా ఒక జాతిగా జీవిస్తూ వచ్చారని, అనితరసాధ్యమైన సాంస్కృతిక వారసత్వం కలిగి ఉన్నారని, ఈ జాతి యొక్క జాతీయతకు పునాదులు సంస్కృతిలోనే ఉన్నాయని గాఢంగా విశ్వసించిన వారు అంబేద్కర్. జాతి సేవలో తాను లీనమై ఉన్న తరుణంలో కొన్ని కొన్ని పదవులను ఆయన స్వీకరించినప్పుడు కర్తవ్య భావనతో వాటిని నిర్వహించి కర్తృత్వ శక్తితో ఆ పదవులకు గౌరవాన్ని ఆపాదింపజేసి తాను నిర్దేశించుకున్న కార్యానికి ఆ పదవులు ఆటంకమవుతున్నాయని తోచిన సందర్భంలో సంకోచించకుండా వాటిని త్యజించారు కూడా. తన ఎదురుగా ఉన్న వారిని తన దారికి తెచ్చుకోవడానికి ఒప్పించటానికి ఏ మాట మాట్లాడినా భారతీయులందరూ ఒక జాతిగా ఒక బలియమైన పటిష్టమైన స్వేచ్ఛ సమానత్వ సోదర భావాల ప్రాతిపదికలుగా జీవిస్తూ దేశ ప్రగతిని సాధించాలని నిరంతరం ఆకాంక్షించే వారు.

డాక్టర్ అంబేద్కర్ ను ఎందుకు గౌరవించాలి, ఎలా అనుసరించాలి! అనే పుస్తకాన్ని డా.వడ్డి విజయ సారథి గారు ఇరవైఏళ్ల క్రితం నవనిర్మాణ ప్రచురణల నుండి వెలువరించారు. ఆ పుస్తకాన్ని చదువుతున్నప్పుడు ఈ యుగంలో బుద్ధ భగవానుడికి తగిన వారసుని రూపంలో అంబేద్కర్ నిలిచారేమో అని మనకనిపిస్తుంది. ధర్మం యొక్క స్వరూపాన్ని నిర్మలంగా వినిపించడానికి,సమాజాన్ని సంస్కరించటానికి ఆనాటి సాంఘిక దురాచారాల మీద దాడి చేసి తన ఉద్దేశాన్ని, సంస్కరణ భావాన్ని వ్యక్తం చేస్తూ సమ సమాజ నిర్మాణానికి గొప్పగా కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్.

మన దేశానికి, జాతికి వారు చేసిన మహోపకారానికి మనం ఎప్పుడూ ఆయనకు ఋణపడే ఉన్నాం!!

**- డా.తలారి వాసు**

## నన్నయ ఎఫ్.ఓ శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ కొత్తపూడి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో బుధవారం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో ఘనంగా జరిగింది. యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు ఎఫ్.ఓ శ్రీనివాసరావు సేవలను ప్రశంసించి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 37 సంవత్సరాలు ప్రభుత్వ ఖజానా అధికారి బాధ్యతలలో శ్రీనివాసరావు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఆర్థిక అధికారిగా సౌమ్యవర్తనతో, నిర్వహణ దక్షతతో, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అందరి మన్ననలు పొందారన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో ఫైనాన్స్ ఆఫీసర్ గా శ్రీనివాసరావు కీలక పాత్రను పోషించారని అన్నారు. విశ్వవిద్యాలయంలో ఆగిపోయిన భవన నిర్మాణాలను పునఃప్రారంభించేందుకు సహకరించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము కార్యాలయ వ్యవస్థను కంప్యూటరీకరించినప్పుడు మొట్టమొదటిసారిగా కంప్యూటర్ సెక్షన్లో వివిధ పదవులలో దశాబ్ద కాలం పాటు శ్రీనివాసరావు అందించిన సేవలు విశేషమైనవన్నారు. సమీకృత గిరిజనాభివృద్ధి నిమిత్తం రంపచోడవరం ఏజెన్సీలో వివిధ శాఖలలో శ్రీనివాసరావు నిర్వహించిన బాధ్యతలు ప్రశంసనీయమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ 1987 లో జూనియర్ గణకునిగా ఉద్యోగ జీవితంలో ప్రవేశించినది మొదలు క్రమక్రమ వికసితోద్భాసిత ప్రతిభా సమన్వయ ప్రభలతో 1994లో సీనియర్ గణకునిగా పదోన్నతిని, 2007లో ఉప ఖజానా అధికారిగా, 2014లో సహాయ ఖజానా అధికారిగా, 2022 నుండి నన్నయ విశ్వవిద్యాలయంలో ఆర్థిక అధికారిగా ఉద్యోగ నిర్వహిస్తూ పదవీ విరమణ చేయడం అభినందనీయమని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని జిల్లా ఖజానా కార్యాలయం, మరియు ఉప జిల్లా ఖజానా కార్యాలయాల కొరకు స్థల సేకరణ, ఖజానా కార్యాలయాల నిర్మాణ విషయాలలో ఆయన విశేషమైన కృషి చేసారన్నారు. సన్మాన గ్రహీత శ్రీనివాసరావు మాట్లాడుతూ కష్టపడి పని చేస్తేనే విజయం దక్కుతుందని తన తండ్రి చెప్పిన మాటను విశ్వసిస్తూ 37 సంవత్సరాలు సర్వీస్ చేసానని అన్నారు. విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు,అధికారులు ఎంతో సహాయ సహకారాలు అందించారని తెలియజేశారు. తన ఉద్యోగ జీవితంలో సహకరించిన తోటి ఉద్యోగులకు, అధికారులకు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రిన్సిపాల్స్ డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు, ఏ.ఆర్.జి.చంద్రకళ, ఈసీ మెంబర్ పి.సురేష్ వర్మ, సిఈ ఎస్.లింగారెడ్డి, డీన్ కె.శ్రీరమేష్, వై.శ్రీనివాసరావు, బి.జగన్మోహనరెడ్డి, ఇంజనీర్ కె.నూకరత్నం విశ్వవిద్యాలయంలో నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను పునరుద్ధరించడంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు ఎంతో కృషి చేసారని దానికి రిజిస్ట్రార్ జి.సుధాకర్, ఫైనాన్స్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు లు ఎంతో కృషి చేసారని తెలియజేసారు. ఖజానా అధికారులు, ఉద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వ వ్యవస్థలో కంప్యూటర్ పై పని చేయాల్సి వచ్చిన కాలంలో అందరూ భయభ్రాంతులకు గురైన నేపధ్యంలో శ్రీనివాసరావు కంప్యూటర్ తో స్నేహం చేసి కంప్యూటర్ నైపుణ్యాన్ని సంపాదించుకొని అందరికీ సహకారిగా ఉండేవారని అభినందనలు తెలియజేసారు. శ్రీనివాసరావు శ్రీమతి సునందల కుమార్తె శ్రీమతిరమ్య మాట్లాడుతూ ఉద్యోగ జీవితంతో పాటు కుటుంబ జీవితంలోను పరిపూర్ణ బాధ్యతను నిర్వహించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు ఆధ్యాపకేతర సిబ్బంది, ప్రభుత్వ అధికారులు సహ ఉద్యోగులు స్నేహితులు ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు.

## తెలుగు విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీ





ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ తెలుగు శాఖ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విశ్వవిద్యాలయ వసతులు, వనరుల గురించి తెలియజేస్తూ పలు సూచనలిచ్చారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

## అప్లికేషన్స్ ఆఫ్ ఆర్డినరీ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ పై ఉపన్యాసం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఆధ్వర్యంలో గురువారం 'అప్లికేషన్స్ ఆఫ్ ఆర్డినరీ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్' అనే శీర్షికతో గణిత విభాగం అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించారు. జేఎన్టీయూ అనంతపూర్ కనిగిరి నుండి విచ్చేసిన ఆచార్య ఎం. చంగలరాజు చక్కని ఉపన్యాసాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డా.టి.హైమావతి విభాగాధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎకనామిక్స్ విభాగం ఫ్రెషర్స్ పార్టీ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ పార్టీ ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు విద్యార్థులకు పలు సూచనలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.




**వీసి పద్మరాజు ను మర్యాద పూర్వకంగా కలసిన డా. సి.హెచ్. లలిత ప్రిన్సిపాల్, తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in